


రేపే పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, ఆగస్టు 29: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఈ నెల 31 నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై గురువారం డీఆర్డీఏ పీడీ, జడ్పీ సీఈవో, డీపీవో, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, లీడ్‌బ్యాంకు మేనేజర్, జీఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో ఈసారి ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయాలని తెలిపారు. 31న పింఛన్ తీసుకోని వారికి.. సోమవారం అందజేయాలని స్పష్టం చేశారు. మండలస్థాయి ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

వామ్మో.. స్కెచ్ పెద్దదే!



ఎచ్చెర్ల బాట్లింగ్ యూనిట్‌లో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. వైసీపీ హయాంలో అప్పటి మంత్రి అండతో చేరాడు. తన బాస్‌ను దారికి తెచ్చుకున్నాడు. ఇక చక్రం తిప్పడం మొదలు పెట్టాడు. ట్రాన్స్‌ఫర్ల దగ్గర నుంచి మద్యం రవాణా చార్జీల వరకు చేతివాటం ప్రదర్శించాడు. ఇప్పుడు అతను, అతని బాస్ రూ.40లక్షలు నొక్కేసేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ పరిధిలోని ఎచ్చెర్ల బాట్లింగ్ యూనిట్‌లో జరిగిన తతంగంపై కథనం..

- రూ. 40 లక్షలు స్వాహాకు యత్నం
- డ్రైవర్ల కష్టాన్ని దోచుకునే పన్నాగం
- ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగే కీలకం
- బాస్ అండతో చెలరేగిపోతున్న వైనం
- సిబ్బంది బదిలీల్లోనూ చేతివాటం
- ప్రభుత్వం మారినా పర్యవేక్షణ కరువాయె

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు.. ఐఎంఎల్ డిపో(బాట్లింగ్ యూనిట్) నుంచి రవాణా చేసేందుకు చిత్తూరుకు చెందిన ఓ సంస్థ కాంట్రాక్టు కుదుర్చుకుంది. అయితే ఆ వ్యక్తి.. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి మరో వ్యక్తికి కాంట్రాక్టు ఇచ్చారు. ఎచ్చెర్ల బాట్లింగ్ యూనిట్ నుంచి వ్యాన్లలో లోడ్ చేసి దుకాణాల వద్ద దించేందుకుగాను ఒక్కో కేస్‌కు రూ.22చొప్పున వ్యాను డ్రైవర్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. రోజూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పరిధిలోని మద్యం దుకాణాలకు 8వేల నుంచి 10వేల కేసుల మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇందుకు 30 మంది వ్యాను డ్రైవర్లు ఉన్నారు. వీరంతా ఈఎంఐల ద్వారా వ్యాన్లను కొనుగోలు చేసుకున్నారు. వీరికి చెల్లించాల్సిన రవాణా చార్జీలు సక్రమంగా చెల్లించక పోవడంతో బకాయిలు రూ.40లక్షలు పేరుకుపోయాయి. కాంట్రాక్టర్ నుంచి చెల్లింపులు జరిగినా.. డ్రైవర్లకు మాత్రం డబ్బులు అందలేదు. ఓ ఉన్నతాధికారి బెదిరించడంతో డ్రైవర్లు కూడా గట్టిగా అడగలేక పోయారు. అయితే ఈఎంఐలు కూడా చెల్లించలేని స్థితిలో డ్రైవర్లు చేరి ఆందోళన బాటపట్టారు. బకాయిలు చెల్లించకపోతే మద్యం రవాణా చేయబోమని.. వ్యాన్ డ్రైవర్లు స్పష్టం చేశారు. దీంతో గురువారం మద్యం కేసుల రవాణా నిలిచిపోయింది. బకాయిల విషయమై ఎక్సైజ్ ఎండీకి, జాయింట్ కలెక్టర్‌కు డ్రైవర్లు ఫిర్యాదు చేశారు. బకాయి చెల్లించకుంటే మద్యం రవాణాను శుక్రవారం కూడా నిలిపివేస్తామని తెలిపారు. వాస్తవ పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

ఆ ఉద్యోగి అంటేనే హడల్..

కొన్నాళ్ల క్రితం బాట్లింగ్ యూనిట్ ఔట్ సోర్సింగ్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా చేరిన ఓ వ్యక్తి.. షాడో బాస్‌గా మారిపోయాడు. డిపోకు వచ్చిన సరుకు.. వెళ్లిన సరుకు వివరాలను కంప్యూటర్‌లో పొందుపరచాల్సిందిపోయి.. తన బాస్‌కు అక్రమ మార్గంలో లబ్ధి కలిగిస్తున్నారని ప్రధాన ఆరోపణ. మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్ బదిలీల కోసం.. ఈ డేటా ఎంట్రీ ఆపరేటర్‌నే సంప్రదించాలి. ఈయన రూ. 30 వేలు తీసుకుంటూ బాస్ ద్వారా ఆదేశాలు ఇప్పించినట్లు తెలుస్తోంది. ఇతను ఓ మాజీమంత్రి బొత్స, ఆయన మేనల్లుడు అనుచరుడిగా గుర్తింపు పొంది ఇక్కడ పట్టు సాధించాడు.

- బాట్లింగ్ యూనిట్‌లోని ఓ అధికారి.. తన వద్ద పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సాయంతో రవాణా చార్జీలు చెల్లించకుండా కాలయాపన చేసినట్లు తెలుస్తోంది. ఇలా రూ.40లక్షలు కాజేసేందుకు కుట్ర పన్నినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పుడున్న వారిని తొలగిస్తామని బెదిరిస్తే.. బకాయి అడగరని వారు యోచిస్తున్నట్లు తెలిసింది. శ్రీకాకుళం ఎక్సైజ్ సూపరిండెంట్.. బాట్లింగ్ డిపోమేనేజర్ ఒకరే. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో రవాణా చార్జీల స్వాహాకు యత్నిస్తున్నట్లు సమాచారం.

నీరు కలిపి.. డబ్బులు పంచుకుంటూ..

కొన్ని నెలలు క్రితం కోటబొమ్మాళి మండలంలోని ఓ దుకాణంలో మద్యాన్ని నీటితో కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించి ఓ ఉద్యోగిని తొలగించారు. కానీ అతను కోర్టుకు వెళ్లి మళ్లీ ఉత్తర్వులు తెచ్చుకుని పని చేస్తున్నాడు. ఇదేరీతిన ఆమదాలవలస, సారవకోట, రాజాం, పాలకొండ, రణస్థలం, పొందూరులో కొన్ని దుకాణాలలో మద్యంలో నీరు (డైల్యూషన్) కలుపుతున్నట్లు, ఇందులో సగం వాటా అక్కడి సిబ్బందికి.. మిగతాది డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా బాస్‌కు చేరుతోందని విశ్వసనీయ సమాచారం.

రవాణా చార్జీలు చెల్లించాలి

- బాట్లింగ్ యూనిట్ వద్ద డ్రైవర్ల ఆందోళన

ఎచ్చెర్ల, ఆగస్టు 29: ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ పరిధిలోని బాట్లింగ్ యూనిట్(ఐఎంఎల్ డిపో) వద్ద లిక్కర్‌ను రవాణా చేస్తున్న వ్యాన్ డ్రైవర్లు గురువారం ఆందోళన చేశారు. రవాణా చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'జిల్లావ్యాప్తంగా వైన్ షాపులకు 30 వ్యాన్‌లతో మద్యాన్ని సరఫరా చేస్తున్నాం. మద్యం లిఫ్టింగ్‌కు సంబంధించి రవాణా చార్జీలను గత 8 నెలలుగా విశాఖపట్నం నుంచి కాంట్రాక్టర్ చెల్లించలేదు. కాంట్రాక్టర్ మొత్తం రూ.40లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి కాంట్రాక్టర్ రూ.20 లక్షల వరకు బకాయి చెల్లించలేదు. వ్యాన్ ద్వారా వస్తున్న అద్దెలతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. చెల్లింపులు సరిగా లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యను పరిష్కరించాలి' కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్ సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళన చేపట్టిన వారిలో వ్యాన్ డ్రైవర్లు బి.కృష్ణ, మహేష్, ఎల్.శ్రీహరి, శివనాగేశ్వరరావు పి.శ్రీను తదితరులు ఉన్నారు.



ఎచ్చెర్ల : బాట్లింగ్ యూనిట్ ఎదుట ఆందోళన చేస్తున్న వ్యాన్ డ్రైవర్లు



విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో చికిత్స పొందుతున్న బాధితులు



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

వెలగాడలో డయేరియా

- ఆస్పత్రుల్లో 31 మంది బాధితులు
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

జి.సిగడాం, ఆగస్టు 29: జి.సిగడాం మండలం వెలగాడలో డయేరియా పంజా విసిరింది. గ్రామంలో సుమారు 31 మంది డయేరియాతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన పిడుగు భాస్కరరావు, ఎం.అమల, పి.ఝాన్సీ, కె.సత్యవతి, పి.కుమార్, పి.పవన్ కళ్యాన్, ఎం.దుర్గమ్మ, పి.రామారావు, పి.తులసి, ఎం.జన, ఎం.సరస్వతి, ఏ.మహేష్, రమణమ్మ, వి.ఉమాదేవి, పి.కూర్మారావు, జి.శ్వేత, టి.తేజ, డి.సన్యాసిరావు, ఎం.అప్పలదాసు, ఎం.త్రినాథ రావుతో పాటు పలువురు మంచం పట్టారు. వీరంతా స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్‌తోపాటు శ్రీకాకుళం, రాజాంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం డీఎంహెచ్‌వో మీనాక్షి.. ఈ గ్రామాన్ని సందర్శించారు. డయేరియా బారిన పడి మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగారు. బాతువ పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.అనూష, ప్రతిష్ఠ శర్మ ఇంటింటికీ వెళ్లి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామంలో వైద్య శిబి రం నిర్వహించారు. ఎంపీడీవో నిశ్చల, వైద్యసిబ్బంది, పంచాయతీ అధికారులు కూడా గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. వేడినీటిని తాగాలని, బయట విక్రయిస్తున్న పదార్థాలు తీసుకోకూడదని సూచించారు.

బాబాయ్ వివాహానికి వచ్చి.. మృత్యుఒడికి చిన్నారి

డయేరియా బారిన పడి నాలుగేళ్ల చిన్నారి గురువారం మృతి చెందింది. బాబాయ్ వివాహానికి వచ్చి.. డయేరియాతో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల్లో తీరని విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. జి.సిగడాం మండలం వెలగాడ గ్రామానికి చెందిన ధర్మవరపు రాము, పైడమ్మ విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులు తమ చిన్నారి రాజేశ్వరి(4)తో కలిసి ఇటీవల రాము సోదరుడు తవిటిరాజు వివాహం నిమిత్తం వెలగాడ వచ్చారు. రాజేశ్వరికి మొదట విరోచనాలు కావడంతో స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్‌కు తరలించారు. అక్కడ వైద్యసిబ్బంది చికిత్స చేసినా డయేరియా తగ్గుముఖం పట్టలేదు. బుధవారం రాత్రి మళ్లీ విరోచనాలు కావడంతో పక్క గ్రామంలో ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. మార్గ మధ్యంలో గురువారం వేకువజామున ఆ చిన్నారి మృతి చెందడంతో పెళ్లి ఇంట విషాదం నెలకొంది. మృతురాలు తాత అప్పన్న, తల్లిదండ్రులు పైడమ్మ, రాము, కుటుంబ సభ్యులు రోదన పలువురిని కంటతడి పెట్టించింది. కాగా.. చిన్నారి మృతిపై బాతువ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతిష్ఠ శర్మ ఆరా తీశారు. ఎక్కడ వైద్యసేవలు పొందారనే విషయమై మృతురాలి కుటుంబ సభ్యులను అడిగారు. ఆర్ఎంపీ వద్ద అని వారు చెప్పగా.. ఆయనతో ఫోన్‌లో మాట్లాడి.. ఏయే మందులు ఇచ్చారని ఆరా తీశారు. ఆర్ఎంపీ మందుల డోస్ ఎక్కువగా ఇవ్వడంతోనే చిన్నారి మృతి చెంది ఉంటుందని తెలిపారు. దీనిపై మరింత విచారణ చేస్తామని వెల్లడించారు.

సాగునీటికి మహర్దశ

- త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు
- ప్రభుత్వ నిర్ణయంపై రైతుల్లో హర్షం
- పదేళ్ల తర్వాత కోలాహలం



మెళియాపుట్టి : అభివృద్ధికి నోచుకోని రాజపురం చెరువు

(మెళియాపుట్టి/ టెక్కలి)

నీటి పారుదల వ్యవస్థ పర్యవేక్షణలో కీలకమైన సాగునీటి సంఘాలు గత వైసీపీ ప్రభుత్వ తీరుతో ఉనికిని కోల్పోయాయి. గత ఐదేళ్లు సాగునీటి రంగానికి నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం.. సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కాలువలు, చెరువుల మరమ్మతులు చేపడుతోంది. తాజాగా.. త్వరలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించింది. మూడు వారాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది. 2014లో ఈ ఎన్నికలు జరగ్గా.. పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సుముఖత చూపింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఐదేళ్లు వదిలేశారు..

సాగునీటి సంఘాలకు స్థానిక సంస్థల నుంచి నిధులు సమకూరుతాయి. రైతులు ఏటా చెల్లించిన నీటి పన్ను డబ్బులు నీటి సంఘాల ఖాతాలో జమవుతాయి. వాటితో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు సమకూరుస్తుంది. కాగా.. గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించింది. గత ఐదేళ్లలో కాలువలు, చెరువుల మరమ్మతులు చేయలేదు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కాలువల్లో గుర్రపు డెక్కలు తొలగించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. చెరువుల పరిధిలో కాలువలను సైతం శుభ్రం చేయలేదు. కాలువలు, చెరువులు స్వరూపం కోల్పోయాయి. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక ఇబ్బందులు పడ్డారు. చెరువుల అభివృద్ధి పేరిట కొంతమంది వైసీపీ నాయకులు.. పనులు చేయకుండానే బిల్లులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 6,564 చెరువులు ఉండగా వంశధార పరిధిలో 269 చెరువులు ఉన్నాయి. వీటిలో 431 నీటి సంఘాలకు గతంలో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో 'నీరు-చెట్టు' నిధులు మంజూరు చేసి చెరువుల్లో నీటి నిల్వలు పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. సాగునీటి రంగానికి పుష్కలంగా నిధులు మంజూరు చేసి బాగు చేశారు. చెరువులు, కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేవారు. తర్వాత టీడీపీ హయాంలో (2014 -2019 మధ్య) ఎన్నికలు నిర్వహించకపోయినా.. నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. తద్వారా చెరువులు, కాలువల్లో అభివృద్ధి పనులు చేపట్టి.. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కానీ వైసీపీ పాలనలో మాత్రం ఎన్నికల ఊసే లేదు. సాగునీటి సమస్యలను పట్టించుకున్న నాథులే లేరు.

ప్రక్రియ ఇలా..

- సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి.. చెరువు ఆయకట్ట రైతులకు భూమి, పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే ఓటర్లుగా గుర్తిస్తారు. పెద్ద, చిన్న చెరువులతోపాటు నదుల ద్వారా సాగునీరు అందే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతులను కూడా ఓటర్లు గుర్తించి.. ఎన్నికలు నిర్వహిస్తారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతను చేపడతారు.
- జిల్లాలో వంశధార పరిధిలో 54 నీటి సంఘాలకు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ఒక ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. నరసన్నపేట పరిధిలో ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, టెక్కలి పరిధిలో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ఒక్కో నీటి సంఘానికి 12మంది టీసీలు (టెరిటోరియల్ కానిస్టెన్సీ) ఉంటారు. అయితే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే సంబంధిత ఆయకట్టు రైతు ప్రభుత్వానికి నీటితీరువా పన్ను బకాయిలు ఉండకూడదు. అలాగే ఆయా ఆయకట్టు పరిధిలో రైతై ఉండాలి.
- వంశధార ప్రధాన ఎడమ కాలువ పరిధిలో డీజీపురం, రావివలస, తిర్లంగి, హెచ్‌ఎన్‌పేట, బన్నువాడ, దేవళభద్ర, నందిగాం, బూరగాం, రౌతుపురంలో 28,848 ఎకరాల ఆయకట్టు రైతులు ఉన్నారు. ఈ ప్రాంతాల్లో నీటిసంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మర్రిపాడు, కవిటి, వీరభద్రాపురం, లక్ష్మీంపురం, అమలకుడియా, అంతరకుడ్డ, నగరంపల్లి టీసీల పరిధిలో 27,931 ఎకరాల ఆయకట్టు రైతులు ఉన్నారు. ఈ గ్రామాల్లోనూ నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు వంశధార అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే నీటి సంఘాల ఎన్నికల సందడి ప్రారంభం కానుంది.

ఆనందంగా ఉంది..

సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో సాగునీటి చెరువుల్లో నీటి నిల్వలు లేక ఇబ్బందులు పడ్డాం. చెక్‌డ్యామ్‌లు, చెరువులు అభివృద్ధి చేయాల్సి ఉంది.

-జన్ని లచ్చయ్య, రైతు, వెంకటాపురం



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

గిడుగు.. మహనీయుడు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 29: తెలుగుభాషలోని మాధుర్యాన్ని ప్రజలకు అందించిన మహనీయుడు.. గిడుగు వెంకట రామ్మూర్తి అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. గురువారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని, తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, సామాన్యునికి చేరువ చేసిన అసామాన్యుడని కొనియాడారు. తెలుగుభాషకు గిడుగు అందించిన సేవలకు గుర్తుగా.. ఆయన జయంతినే మాతృభాషా దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సూర్యకిరణ్, ఏవో సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.




శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు

సిక్కోలు జలమయం

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లా అంతటా వర్షం కురవడంతో సిక్కోలు జలమయమైంది. పిడుగుల మోతతో ప్రజలు భీతిల్లారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు చేరగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సంతబొమ్మాళి మండలంలో 29.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఆమదాలవలసలో 26.75, శ్రీకాకుళం - 26.0, ఇచ్ఛాపురం- 19.75, ఎచ్చెర్ల- 17.75, రణస్థలం- 16.0, పలాస - 12.25, కవిటి- 8.5, నందిగాం- 7.5, హిరమండలంలో 5.25 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శుక్రవారం • 30 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన సజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని సజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్విరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!



ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహానటుడు పృథ్విరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశ పెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన 'శ్రీ సత్యనారాయణ మహత్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహా రెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహానాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.

ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.

కొత్తగా...



తెలుగు భాషా దినోత్సవం రోజున...

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు, ధ్యాన్‌చంద్ జయంతి

వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలను గురువారం నిర్వహించారు. వ్యావహారిక భాష వ్యాప్తికి రామ్మూర్తి పంతులు చేసిన సేవలను కొనియాడారు. అలాగే ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. పలు పాఠశాలల్లో గిడుగుతో పాటు తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం




నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలాసరూరల్: జనజాగృతి సాహితీ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళి


సంతబొమ్మాళి: బోరుభద్రలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


టెక్కలి: తలగాం పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


హిరమండలం: అవలంగి ఉన్నత పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ జయంతి..


నందిగాం: పెద్దతామరాపల్లి పాఠశాలలో



జలుమూరు: రావిపాడు, పోలాకి: పిరువాడ పాఠశాలల్లో తెలుగు కవుల వేషధారణలు

కుంటికోట నారాయణ హైస్కూల్‌లో..


హరిపురం: తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు

హరిపురం: కుంటికోట నారాయణ హైస్కూల్ ఆవరణలో గురువారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని కరస్పాండెంట్ గుంట రోహిణీ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు వాడిగా ఉందాం.. తెలుగు వాణిని వినిపిద్దామన్నారు. విద్యార్థులు తెలుగు కవుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాతపట్నం: జాతీయ క్రీడాదినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు


పలాస: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నడక పోటీల్లో విద్యార్థినులు

కణితివూరు ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

నందిగాం: కణితివూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఎంఈవో-1జి.నర్సింహులు పర్యవేక్షణలో హెచ్ఎం కె.సీతరాజు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా అన్నెపు శ్రీదేవి, వైస్‌చైర్మన్‌గా గరికి రూపావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో ప్రమాణ స్వీకారంచేయించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ పాఠశాలలో ఈనెల 8న ఘర్షణతోను, 17న కోరం లేక వాయిదా పడిన సంగతి తెలిసిందే.

ముచ్చటగా మూడోసారి వాయిదా

కోటబొమ్మాళి: దండ ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ మెనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎన్నిక మూడోసారి కోరంలేక వాయిదా పడింది. గురువారం ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేయగా మూడు తరగతులకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకాకపోవడంతో వాయిదా పడింది. పాఠశాలలో 8 తరగతులకు గాను 5 తరగతుల్లో సభ్యులను గతంలోనే ఎన్నుకున్న సంగతి తెలిసిందే. గతంలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో గట్టిపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తదుపరి ఎన్నిక తేదీని ప్రకటిస్తామని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఎంఈవో ఎల్వీ ప్రతాప్, హెచ్ఎం గొండు నారాయణరావు తెలిపారు.

పూశాంలోనూ..

పూశాం(ఎల్.ఎన్.పేట): మండలంలోని పూశాం జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక గురువారం కోరంలేక నిలిచిపోయిందని ఎంఈవో సీహెచ్ మణి కుమార్ తెలిపారు. పాఠశాలలో 7, 9వ తరగతుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కోరంకు సరిపడినంతమంది హాజరు కాకపోవడంతో ఎన్నిక జరగలేదన్నారు. గతంలో రెండుసార్లు ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. తదుపరి ఎన్నిక తేదీన జిల్లా అధికారుల ఉత్తర్వుల ప్రకారం ప్రకటిస్తామన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు సహకరించాలి

నరసన్నపేట: పట్టణంలో తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారికి పోలీసు శాఖ నుంచి సహకారం అందించాలని పట్టణ కళింగ కోమటి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సీఐ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసు అధికారుల సూచనల మేరకు తోపుడు బండ్లు పెట్టుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు, తంగుడు జోగారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మందస: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ ఖాదర్‌భాషా అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మండలంలో రౌడీషీటర్లు, దొంగతనాలు, గంజాయి, సారా అక్రమ రవాణాపై ఆరా తీశారు.

నాయిబ్రాహ్మణుల వేతనాల పెంపుపై హర్షం

మందస/హరిపురం: దేవాలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనాలు పెంచుతామని సీఎం ప్రకటించడంపై పార్లమెంటు నాయిబ్రాహ్మణ బీసీ సాధికారిత కమిటీ కన్వీనర్ కుప్పిలి వెంకట్రావు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో బోర్డు సభ్యులుగా నాయిబ్రాహ్మణులకు అవకాశం కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయ పనివేళల్లో మార్పు

మందస: మందస శాఖగ్రంథాలయంలో పాఠకుల సౌకర్యార్థం పని వేళల్లో మార్పులు చేసినట్లు గ్రంథాలయాధికారి జె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పరీక్షల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుందని, వినియోగించుకోవాలని కోరారు.

శిథిల భవనాల్లో తరగతులు వద్దు

నరసన్నపేట: వర్షాలకు కారుతున్న భవనాల్లో తరగతులు నిర్వహించవద్దని ఎంఈవో పేడాడ దాలినాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న భవనాల వైపు విద్యార్థులను వెళ్లనీయవద్దని సూచించారు. వర్షంలో పిల్లలను బయటకు విడిచిపెట్టకుండా తరగతుల్లో కూర్చొబెట్టాలన్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరితే అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులను నిర్వహించాలని హెచ్ఎంలకు సూచించారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

హరిపురం: దశాబ్దాలుగా పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. మందస మండలం ఏజెన్సీ ప్రాంతాలైన కొండలోగాం, పట్టులోగాం, కరేపల్లి తదితర గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు పోతనపల్లి కుసుమతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబరు 10న నిర్వహించనున్న కుమారన్న, సీతారాముల 26వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు గొర కల బాలకృష్ణ, పోతనపల్లి మల్లేశ్వరరావు, ఆదివాసీ ప్రతినిధులు సీమలన్న, సురంగి, భాగ్యవతి, ప్రశాంతి, లలిన మనోహర్, సాయి పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

టెక్కలి: పట్టణంలో శుక్రవారం చేపట్టనున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో బి.సుదర్శన్‌దొర కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో మొక్కలు నాటాల్సిన ప్రాంతాలను పరిశీలించి, కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఎల్పీవో రమణ, డీఎల్డీవో అలివేలు మంగమ్మ, ఎంఈవో చిన్నారావు, ఈవో జగన్నాథరావు, మండలపరిషత్ సూపరింటెండెంట్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● **పోలాకి:** వనమహోత్సవాన్ని శుక్రవారం వాడవాడలా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఎంపీడీవో కె.ఉషశ్రీ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణల్లో మొక్కలు నాటాలన్నారు. కళాశాల, ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీల్లో జరుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మెళియాపుట్టి: మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్ర వారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఏపీవో రవి తెలిపారు. సర్పంచ్‌లు, అధికారులు, వేతనదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న నకిలీ దివ్యాంగ పింఛన్లపై దర్యాప్తు

కోటబొమ్మాళి: దంత గ్రామంలో నకిలీ దివ్యాంగ పింఛన్లపై రెండు రోజులుగా డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, వైద్య బృందంతో చేపడుతున్న దర్యాప్తు గురువారం కూడా కొనసాగింది. అయితే లబ్ధిదారులు దర్యాప్తునకు ధ్రువపత్రాలతో హాజరుకాకపోవడంతో దర్యాప్తులో జాప్యం జరుగుతోంది. దీనిపై కలెక్టర్ సైతం ఆగ్రహంగా ఉన్నారు. ధ్రువపత్రాలతో దర్యాప్తు అధికారులకు సహకరించకుంటే పింఛన్లు రద్దు చేస్తామని అధికారులు సైతం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రావణ బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ అర్చకులు తిరువీధి ఉత్సవం చేపట్టారు. పలువురు మహిళలు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు నర్సింగపల్లి ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: నర్సింగపల్లి 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గూడెం, నర్సింగపల్లి, ముఖలింగాపురం పంచాయతీల పరిధిలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

శ్రీరామసేవా సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి శ్రీరామసేవా సంఘం కార్యవర్గాన్ని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా మోస వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గుంటి గురునాథం, ప్రధాన కార్యదర్శిగా అర్జాల ఈశ్వరరావు, ఉప కార్యదర్శిగా సింగుపల్లి జగన్నాథం, కోశాధికారిగా కాస చలపతిరావులను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు వ్యవహరించారు.

గాయపడిన గోమాతకు సపర్యలు

నరసన్నపేట: పట్టణంలో మారుతీనగర్-2లో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు తీవ్రంగా గాయపడింది. గురువారం ఉదయం నుంచి వర్షంలో రోడ్డు పక్కనే కాలువ వద్ద పడి ఉన్న గోవు పరిస్థితిని ఎంపీటీసీ మాజీ సభ్యుడు జామి వెంకట్రావు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మార్పు విజయ్‌కుమార్ స్పందించి పంచాయతీ ఉద్యోగి మహేష్ సాయంతో గాయపడిన ఆవును పశువైద్యశాలకు తరలించి సపర్యలు చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ఎస్ఐగా మహ్మద్ యాసిన్

హిరమండలం: హిరమండలం ఎస్ఐగా మహ్మద్ యాసిన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాతపట్నం నుంచి ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇప్పటి వరకు పనిచేసిన నారాయణస్వామి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

జలుమూరు ఎస్ఐగా అశోక్‌బాబు

జలుమూరు: ఎస్ఐగా బి.అశోక్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నరసన్నపేట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఇంతవరకు పనిచేసిన మధుసూదనరావుకు విశాఖపట్నం వీఆర్‌కు బదిలీ చేశారు.

ఒడిశా

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పర్లాకిమిడి: జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పాలనాధికారి విజయ్‌కుమార్ దాస్ అన్నారు. గురువారం జిల్లా క్రీడాధికారి, అదనపు కలెక్టర్ ప్రానకృష్ణ ఆధ్వర్యంలో గజపతి ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు వ్యాయామోపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి యమదర్‌సాహు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పర్లాకిమిడి: తెలుగు భాషా దినోత్సవం చైతన్య ఆంధ్ర సాహితీ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో లక్ష్మీ డెంటల్ మెడికల్ హాల్ ప్రాంగణలో గురువారం నిర్వహించారు. వ్యవహారిక భాషా మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆనంద్ తెలుగు భాషా గొప్పదనాన్ని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వీఎస్ఎన్ రాజు, ఎం.శేఖర్, బి.నాగేశ్వరరావు, సుధ, నారాయణ, మురళీ, ఎస్ఎన్ పండా పాల్గొన్నారు.

ఐదేళ్లలో 'ఉపాధి' నిఘా వ్యవస్థ నిర్వీర్యం

- చేసిన పనుల్లో 20 శాతం ఇస్తే అన్నీ సక్రమమే
- సోషల్ ఆడిట్ బృందాలతో బేరసారాలు?

(మెళియాపుట్టి)


పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారా.. అయినా పర్వాలే.. సోషల్ ఆడిట్ బృందాలకు మీరు చేసిన పనుల్లో 20 శాతం కనీసం సొమ్ము ఇవ్వగలిగితే ఎన్ని తప్పులు చేసినా ఇబ్బందేమీ ఉండదు.. ఇదీ గడచిన ఐదేళ్లుగా ఉపాధి హామీ పనుల్లో సాగుతున్న వ్యవహారం.. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తే అవినీతి, అక్రమాలు వెలికితీసేందుకు అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వ భావన. అయితే ఈ ఆడిట్ సోషల్ బృందాలకు, సంబంధిత అధికారులకు కల్పవృక్షంలా మారిందన్న విమర్శలు లేకపోలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకంపై నిఘా కొరవడింది. ఇదే అదునుగా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు అవినీతి, అక్రమాలకు పాల్పడినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు ఆస్కారం ఇస్తోంది. ఒక వేళ పనుల్లో అక్రమాలు అప్పుడప్పుడు బయటపడినా నామమాత్రంగా రికవరీ చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా నిర్వహించేందుకు నాలుగు రకాల వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అయితే గడచిన ఐదేళ్లుగా వారి కళ్లకు గంతలు కట్టి క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నేతలు అక్రమాలకు గేట్లు ఎత్తారన్న విమర్శలు వస్తున్నాయి.

రూ.67.04 లక్షలు పక్కదారి

జిల్లాలో గత నాలుగేళ్లలో 1,609 మంది క్షేత్రస్థాయి సిబ్బంది నిధులు పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. 2020 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.67.04 లక్షలు అక్రమాలకు పాల్పడిట్లు తేలింది. మళ్లీ జిల్లా అధికారులు సరిచేసిన తరువాత రూ.27.49 లక్షలుగా నిర్ధారించారు. ఇందులో రూ.13.45 లక్షలు మాత్రమే రికవరీ చేసినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి ఏమేర అక్రమాలు జరిగాయో తెలుసుకోవచ్చు. మిగిలిన మొత్తం ఎందుకు రికవరీ చేయలేదో అధికారులకే ఎరుక. రికవరీలో అప్పటి వైసీపీ నేతల పేర్లు చెప్పి క్షేత్రస్థాయి సిబ్బంది తప్పించుకున్నట్లు సమాచారం. ఇప్పుడు వారంతా టీడీపీ నాయకులు వెనుక తిరిగి వారి మెప్పుకోసం, రికవరీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. రూ.రెండు లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సోషల్ ఆడిట్ జరిగేటప్పుడు రూ.5 వేల వరకు క్షేత్రస్థాయి సిబ్బంది వసూలు చేసినట్లు ఆరోపణలొస్తున్నాయి. అలాగే దీనితో పాటు సంబంధిత టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ నుంచి సైతం వసూళ్లు చేసి పంపకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధి పనుల్లో దొంగ మస్తర్లు వేయడం, క్షేత్రస్థాయిలో చేసిన పనులు కనిపించకపోవడంతో రికవరీ రాస్తామన్న బృందం సభ్యులతో కొన్ని పంచాయతీ ల్లో బేరసారాలు చేస్తున్నారు. దీంతో పనిలో 10 శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇకనైనా కూటమి ప్రభుత్వం సోషల్ ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఉపాధి ఏపీడీ శైలజను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు తప్పవు: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో

పలాసరూరల్: లింగ నిర్ధారణకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో భరత్‌నాయక్ స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఉప జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ నేరమని, ఎవరైనా గర్భంలో ఆడ, మగ తెలుసుకునే పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీసీఎన్‌డీటీ చట్టం నిబంధనలు ప్రజలకు కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి హరిప్రియ

టెక్కలి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ అన్నారు. ఈ మేరకు గురువారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. దీనిపై కక్షిదారులకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా గురువారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీంతో పొలా ల్లో నీరు చేరి పంటలు మునిగిపోయాయి. పలు ప్రాంతాల్లో పొలాల నుంచి నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైవే అండర్ పాసేజ్‌లో నీరు చేరి వాహన దారులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. తంపర భూముల్లో వరద నీరు చేరింది. పట్టణాల్లో పలు వీధుల్లో వర్షపునీరు నిలిచి పోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చప్టాలపై నుంచి నీరు ప్రవహించడంతో రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: కరవంజ చెరువు చప్టాపై నుంచి ప్రవహిస్తున్న నీరు


నరసన్నపేట: పొలాల నుంచి హైవే సర్వీస్ రోడ్డులో చేరిన వర్షపు నీరు


పలాసరూరల్: కిష్టుపురం అండర్‌పాసేజ్‌లో వర్షపు నీటిలో వాహనదారుల ఇక్కట్లు


సంతబొమ్మాళి: బోరుభద్ర పంట పొలాల్లో నిలిచిన నీరు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


వరహాలు (ఫైల్)

కోటబొమ్మాళి: జర్జంగి-చల్లపేట మార్గంలో గంగుపేట గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం యలమంచిలికి చెందిన బెండి వరహాలు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వరహాలతో పాటు అదే గ్రామానికి మామిడివలస మల్లేశ్వరరావు కలిసి నారాయణవలస వారపు సంతకు పశువుల వ్యాపారం కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గంగుపేట సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న ఒక నీటి కుంటలో పడడంతో వరహాలు మృతి చెందాడు. మల్లేశ్వరరావు కొంతదూరం తుళ్లిపడి గాయాలతో బయటపడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

దుబాయ్‌లో వలస కూలీ..


శివ మజ్జి (ఫైల్)

కవిటి: దుబాయ్‌లో ఓ వలస కూలి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బొరివంకకు చెందిన శివ మజ్జి (24) ఇదే గ్రామానికి చెందిన బిసాయి మోహన్‌తో కలిసి పైపులైన్ వెల్డింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. శివ తండ్రి జగన్నాథం పదేళ్ల కిందట మృతి చెందాడు. ఈనేపథ్యంలో తల్లి ఉర్మిళ, మానసిక దివ్యాంగుడైన తమ్ముడును ఆదుకుని కుటుంబాన్ని పోషించాలనుకున్నాడు. దీంతో తోటి స్నేహితునితో కలిసి ఆరు నెలల కిందట దుబాయ్‌లోని ఓ కంపెనీలో పనికోసం వెళ్లాడు. ఐదునెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. రెండురోజులుగా కుటుంబసభ్యులకు సమాచారం లేకపోవడంతో వారంతా ఆందోళన చెందారు. ఇచ్ఛాపురంలోని ఓ ఇనిస్టిట్యూట్ ద్వారా దుబాయ్ వెళ్లాడని తెలుసుకుని బంధువులు అక్కడికి వెళ్లి విచారణ చేస్తే వారు సరైన సమాధానం ఇవ్వలేదు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి శివ మజ్జి మృతిచెందాడని స్నేహితుడు బి.సాయి మోహన్ గ్రామానికి సమాచారం అందించాడు. రెండురోజుల కిందట కంపెనీలో పని చేస్తుండగా శివ మజ్జిపై ఇనుప పైపు జారిపడడంతో ప్రమాదానికి గురయ్యాడు. మజ్జి మృతితో తల్లి ఉర్మిళ రోదిస్తూ కుప్పకూలింది. గ్రామంలో విషాదం నెలకొంది.

జ్వర లక్షణాలతో బాలిక ..

కంచిలి: మండలంలోని జాడుపుడికి చెందిన లాబాల ఝాన్సీ (6) జ్వర లక్షణాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.తల్లిదండ్రులు, స్థానికుల కథనం మేరకు..జాడుపుడికి చెందిన లాబాల కామరాజు ఆటో నడిపి కంచిలిలో నివాసముంటున్నాడు. కామరాజుకు ఇద్దరు కుమార్తెలు కాగా వీరిలో ఝాన్సీకి ఇటీవల అనారోగ్యం బారినపడడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. జ్వరం తగ్గడంతో ఈనెల 17న పాఠశాలకు పంపించారు. అక్కడ స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.నయం కాకపోవడంతో సోంపేటలోని ఓపిల్లల వైద్యుడివద్దకు తీసుకువెళ్లారు.పరిస్థితి మెరుగుపడకపోవడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది.ఝాన్సీ మృతితో జాడుపుడి, కంచిలిలో విషాదఛాయలు అలముకున్నాయి.

రామకృష్ణాపురంలో చోరీ

జలుమూరు: అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో రేగాన విష్ణుమూర్తి ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. మూడు తులాల బంగారం, 15 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.. విష్ణుమూర్తి తన కుమార్తె గృహప్రవేశానికి బూర్జ మండలం సుంకరిపేటకు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి వెనుకభాగంలో తలుపులు తీసి ఉండడం, బీరువా పగుల గొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీ సులు, క్లూస్‌టీం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విష్ణు మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు.

వివాహిత మృతిపై డీఎస్పీ దర్యాప్తు

నరసన్నపేట: పట్టణానికి చెందిన బరాటం అనూరాధ మృతిపై టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు గురువారం దర్యాప్తు నిర్వహించారు. స్థానిక వీఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న బరాటం శ్రావణ్ భార్య అనూరాధ బలవర్మణానికి పాల్పడిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై అనూరాధ తల్లి కిల్లంశెట్టి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదుపై వరకట్న వేధింపుల కేసుగా పోలీసులునమోదు చేశారు.ఈ నేపథ్యంలో డీఎస్పీ అనూరాధ తల్లిదండ్రులను దర్యాప్తుచేశారు. ఈ వ్యవహారంలో భర్త శ్రావణ్, అత్తమామల పాత్రపై కూడా దర్యాప్తు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంపోలులో న్యాయవిజ్ఞాన సదస్సు

గుజరాతీపేట: ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను పెట్టుకోలేని వారు తమను సంప్రదిస్తే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. గురువారం అంపోలు జిల్లా జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. శాలిహుండాం కేజీబీవీ పాఠశాలలో తనిఖీ చేసి వసతులు, అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో జి.ఇందిరా ప్రసాద్, అడ్వకేట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, జిల్లా జైలు అధికారులు పాల్గొన్నారు.

40 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్: కలెక్టర్


శ్రీకాకుళం స్పోర్ట్స్: మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం స్పోర్ట్స్: మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.ఖేలో ఇండియా పథకంలో భాగంగా పాత్రునివలసలో కేంద్ర ప్రభుత్వ నిధులతో దీనిని నిర్మాణం పూర్తిచేసి రెండేళ్లలో క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గురువారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పాత్రునివలసలో నిర్మిస్తున్న క్రీడా వికాస్ ప్రాంగణంలో అన్ని క్రీడలు ఒకే చోటుకు తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తొలుత ఏడు రోడ్ల కూడలి నుంచి శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వరకు క్రీడాకారులతో 2కె రన్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో కె.శ్రీధర్, సెట్‌శ్రీసీఈవో ప్రసాదరావు, ఎన్.నారాయణరావు, ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు, కోచ్‌లు మాధురి, మణికంఠ, హరికృష్ణ పాల్గొన్నారు.

- **ఎచ్చెర్ల:** క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన క్రీడా దినోత్సవంలో మాట్లాడుతూ హాకీ క్రీడకు అంతర్జాతీయంగా ఖ్యాతి సాధించిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని కొనియడారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టర్ నీలంశెట్టి గురివినాయుడు, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎ.భాస్కర్ పాల్గొన్నారు.
- **కవిటి:** కవిటి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్య క్రమంలో క్రీడల ఆవశ్యకతను ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు వివరించారు. బి.గొనపపుట్టుగలో పీఈటీ, తెలుగు ఉపాధ్యాయులు జోత్స్న,బి.రమేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జె.పాపారావు,హెచ్ఎం బి.బాబూరావు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

శ్రీకాకుళం రూరల్: రైతులు యాంత్రీకరణను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గురువారం రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ శాఖలు వ్యవసాయ యాంత్రీకరణపై మేళా కార్యక్రమం ఏర్పాటుచేశాయి.ఈ సందర్భంగా ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీ మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ యంత్రీకరణలో రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.కార్యక్రమంలో కోరమండల్ నుంచి సుబ్బారెడ్డి,పరిశోధకులు సాంబమూర్తి, రమణ, పీవీకే జగన్నాథం,సత్యనారాయణ, ప్రమీణారాణి, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, నాబార్డు డీడీ ఎం.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధి లేక.. సంపద రాక

- నిర్వహణ లేక మూలకుచేరిన పరికరాలు
- ఇదీ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం డంపింగ్ యార్డులో పరిస్థితి


నిరుపయోగంగా ఉన్న తడి-పొడి చెత్త నిర్మాణ కేంద్రం..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ సంబంధించిన డంపింగ్ యార్డు నిర్వహణపై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో సంపద సృష్టికి నోచుకోవడం లేదు. ప్రధానంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వర్మీకంపోస్ట్ యూనిట్, తడి-పొడిచెత్త వేరుచేసే కేంద్రాలు, పల్వనైజర్, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలు నిర్వహణ లోపం వల్ల మూలకు చేరాయి.
-పలాస

కోసంగిపురం జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం డంపింగ్‌యార్డు నిర్వహణ నీరుగారుతోంది. జిల్లాలో అన్ని మునిసిపాలిటీల కంటే ఎక్కువ వైశాల్యంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుచేశారు. తొమ్మిది ఎకరాల్లో ఉన్న ఈ డంపింగ్‌యార్డులో ప్రతిరోజూ మునిసిపాలిటీలో 50 టన్నుల వరకు వివిధ వ్యర్థాలు అక్కడ పోగుచేస్తుంటారు. అయితే వాటి నుంచి సంపద సృష్టించేందుకు అవకాశం ఉన్నా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో సేకరించిన చెత్తను అక్కడే పోగులుపెట్టి విడిచిపెడుతున్నారు. దీంతో చెత్త కుళ్లడం వల్ల ఇక్కడ దుర్వాసన వెలువడడంతోపాటు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని పట్టణ వాసులు చెబుతున్నారు. మునిసిపల్ అధికారులు చెత్త నిర్వహణపై దృష్టిసారించి ఉంటే సంపద రావడంతోపాటు ప్రజలకు దుర్వాసన సమస్య నుంచి విముక్తి లభించే అవకాశం ఉండేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అధికారులు మాత్రం డంపింగ్ యార్డును ఏటీఎం మాదిరిగా వినియోగించుకుని నిధులు దుబరా చేస్తున్నారే తప్పా ఒక్క అభివృద్ధిపనీ పూర్తి చేయలేకపోతున్నారన్న విమర్శలొస్తున్న విషయం విదితమే.

నిర్వహణలేక శిథిలం..

డంపింగ్ యార్డు నిర్మాణ సమయంలోనే వర్మీకంపోస్ట్ యూనిట్, తడి-పొడిచెత్త వేరుచేసే కేంద్రాలు, పల్వనైజర్, వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలు నిర్మించారు. ఆ తర్వాత మునిసిపల్ అధికారులు నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరాయి. 2019లో సంభవించిన తితలీ తుఫాన్ సమయంలో ఉన్న కాస్తా నిర్మాణాలు దెబ్బతినగా, పరికరాలు పాడయ్యాయి. దీంతో డంపింగ్ యార్డులో చెత్తను కాల్చి బూడిద చేయడం తప్పా సంపద విషయాన్ని అటకెక్కించారు. ప్రధానంగా జంట పట్టణాల్లో సేకరిస్తున్న చెత్త నుంచి ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలు వేరుచేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉంది. అయితే అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో డంపింగ్ యార్డులో కొన్ని నిర్మాణాలనే తప్పా కార్మికులు లేకుండా పోయారు. డంపింగ్ యార్డులో ప్రహరీ, మంచినీటి సౌకర్యాలు ఉన్నా, సిబ్బంది సమస్య వేధిస్తోంది. కొద్దిమంది సిబ్బందిని నియమించి డంపింగ్ యార్డును అభివృద్ధి చేస్తే మున్సిపాలిటీకి దీర్ఘకాలిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

డంపింగ్ యార్డు అభివృద్ధికి చర్యలు..

డంపింగ్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాలను బాగు చేయిస్తున్నామని చెప్పారు.సిబ్బంది కొరత వల్ల కలుగుతున్న ఇబ్బందులు అధికమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పూర్తిస్థాయి పనులు ప్రారంభిస్తే చెత్త నుంచి ఆదాయం కూడా వస్తుందని చెప్పారు.


డంపింగ్ యార్డులో సేకరించిన చెత్తకు నిప్పంటించి బూడిద చేస్తున్న దృశ్యం..

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

- జిల్లా వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవం


కవిటి: గిడుగు విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్


ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో తెలుగు అక్షరం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


జి.సిగడాం: గిడుగు చిత్రపటం వద్ద కేజీబీవీ సిబ్బంది నివాళి

తెలుగు భాషను పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిటి ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో గిడుగు రామ్మూర్తి విగ్రహాన్ని ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే అశోక్ ఆవిష్కరించారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కళ్లేపల్లి ఉదయకిరణ్ రాసిన ఖాకీ చొక్క పుస్తకాన్ని ఆవిష్కరించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


శ్రీకాకుళం కల్చరల్: గిడుగు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


ఎచ్చెర్ల: ఖాకీ చొక్క పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రజని

మాతృభాషపై ఆసక్తి పెంచుకోవాలి

- ట్రిపుల్ ఐటీ తెలుగు ప్రొఫెసర్ పెద్దింటి ముకుందరావు

గుజరాతీపేట: యువత మాతృభాషపై ఆసక్తిపెంచుకుని పరిరక్షించుకోవాలని ట్రిపుల్ ఐటీ తెలుగు ప్రొఫెసర్ పెద్దింటి ముకుందరావు పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్‌లో గల కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి నిర్వహించారు.ఈసందర్భంగా పెద్దింటి ముకుందరావు మాట్లాడుతూ మాతృభాష తెలుగు అత్యంత మధురమైనదని, దీనిని ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా అందరూ అభివర్ణించారన్నారు. కళాశాల తెలుగు భాష అధ్యాపకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ ఎందరో మహానుభావులను ఈ రోజు స్మరించుకోవడం వెనుక రామ్మూర్తి పంతులు వంటివారి కృషిఉందన్నారు. వ్యాసరచన,వక్తృత్వ, చిత్రలేఖనపోటీల్లో విజేతలకు బహుమతు లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముకుందరావు

నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రసాదరావు

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీడీ ప్రసాదరావు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు మునిసిపాల్టీలు, నగర పాలక సంస్థలకు కమిషనర్లను ప్రభుత్వం గురువారం నియమించింది. ఇందులో భాగంగా గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ - 1 మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాదరావు బదిలీపై శ్రీకాకుళం నగరపాలక సంస్థకు రానున్నారు. ఇప్పటివరకు సుడా చైర్మన్ ఓబులేసు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించారు. అలాగే పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్‌ను కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులను జారీచేశారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వైఎస్ పేరు తొలగింపు

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: ఉద్దానంలోని కిడ్నీరోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు టీడీపీ హయాంలో 2014-19లో కిడ్నీరీసెర్చ్ సెంటర్‌కు శ్రీకారంచుట్టారు ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మించి వైఎస్ఆర్ పేరును పెట్టింది. ఇటీవల పది మెడికల్ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లకు వైఎస్ఆర్ పేర్లను తొలగిస్తూ పాతపేర్లను కొనసాగించేలా రాష్ట్రప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.ఈ మేరకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వైఎస్ఆర్ పేరును తొలగించి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు నాంది పలికిన ప్రముఖులు, జిల్లాకు చెందినవారి పేరును ప్రభుత్వం పరిశీలిస్తోంది. అతి త్వరలో కొత్తపేరును రీసెర్చ్ సెంటర్‌కు పెట్టనున్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు: అచ్చెన్న

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం శ్రీకాకుళం జడ్పీ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు ఎరువుల కొరత సమస్య పరిష్కరించాలని అధికారులను కోరిన విషయం విదితమే. ఈనేపథ్యంలో గురువారం పత్రికల్లో కథనాలు రావడంతో తక్షణ చర్యలకు మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లాకు తక్షణమే 820 టన్నుల డీఏపీ, 760 టన్నుల యూరియాను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రికి అదనపు ఎరువులు జిల్లాకు చేర్చి శుక్రవారం నుంచే రైతులకు పంపిణీ చేయాలని మంత్రి స్పష్టంగా ఆదేశించారు. అలాగే సెప్టెంబర్ మొదటి వారంలో వెయ్యి టన్నుల యూరియాతోపాటు అవసరం మేరకు డీఏపీ కూడా పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సునీతను టీడీపీలోకి చేర్చుకోవద్దు: శిరీష

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత ఆపార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో టీడీపీలో సునీతను చేర్చుకోవద్దని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గతంలో టీడీపీ నుంచి వైసీపీలోచేరిన సునీత... సారా విక్రయిస్తున్నారని నారా భువనేశ్వరిని, బ్రాహ్మణిలను విమర్శించారని, ఇప్పుడు వైసీపీ ఓటమిచెందిన తర్వాత టీడీపీలో చేరుతామంటే ప్రజలు ఆమె చేసిన వ్యాఖ్యలను ఎలా మరిచిపోతారని ట్విట్టర్, ఫేస్‌బుక్ వేదికగా ప్రశ్నించారు. ఇన్నాళ్లు పార్టీలో ఉండి సోషల్‌మీడియాలో వైసీపీ చేసిన నీచవ్యాఖ్యలను తట్టుకుని నిలబడితే.. ఇప్పుడు అడ్డగోలుగా విమర్శలు చేసి మళ్లీ టీడీపీలో చేరిపోతామంటే మోహంపై జనంఉమ్మువేస్తారని తెలిపారు. టీడీపీలో సునీతను చేర్చుకోవద్దనేది సోషల్ మీడియా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశానని పేర్కొన్నారు.

హిందూధర్మాన్ని పరిరక్షించాలి

కంచిలి: హిందూ ధర్మ పరిరక్షణకు యువత ముందుకురా వాలని వక్తలు కోరారు. గురువారం మఖరాంపురం బాబా మందిరంలో హిందూ ధర్మకార్యం సభ్యుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వేషధారణలో ఇటీవల గోపాలపురంలో మంచి ప్రదర్శన ఇచ్చిన టీడీపీ నాయకుడు తమరాల వెంకటరమణను సన్మానించారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తమరాల సీతారామమూర్తి, తమరాల శోభన్‌బాబు, శివ గురువు, కొక్కిలి దేవదత్తం, షిర్డీ సాయి ధర్మకర్త రమణసాయి, భోగి, కృష్ణారావు, లక్ష్మణ్, రమణ పాల్గొన్నారు.

రుణలక్ష్యాలు పూర్తి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్: జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రుణ లక్ష్యాలు బ్యాంకర్లు పూర్తి చేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి త్రైమాసికం రుణాల లక్ష్యం రూ.12,943 గాను రూ.4,8 87కోట్ల రుణాలు మంజూరు చేసి 38 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.8343కోట్లకు గాను రూ.2792కోట్ల రుణాలు అందజేసినట్లు చెప్పారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని, అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాని ఆదేశించారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, రీజినల్ మేనేజర్ ఎంవి తిలక్, ఆర్బీఐ ఏపీ రీజియన్ ఎల్డీఓ గిరిధర్ బెహరా, నాబార్డు డీడీ ఎం.కె.రమేష్, వ్యవసాయాధికారి కె.శ్రీధర్, పశుసంవర్ధకశాక జెడి జయరాజు, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, జిల్లాలోని 26 బ్యాంకులకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సవరగోవిందపురంలో ప్రధానమంత్రి జన్‌మన్

కంచిలి: మండలంలోని కేబీ నౌగాం పంచాయతీ పరిధిలోగల సవర గోవింద పురంలో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీవో వి.నీరజ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలికసౌకర్యాల కల్పనే లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, ఏపీవో ధనుంజయ, గృహనిర్మాణ శాఖ ఏఈ అప్పారావు, ఈవోపీఆర్డీ ఈ.రాంబాబు, సర్పంచ్ జన్ని హరిబందు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై విచారణ: ఎమ్మెల్యే కూన

పొందూరు: ప్రభుత్వపాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో నిధుల దుర్వినియోగంపై విచారణ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గురువారం పొందూరులో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పేరుతో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నిధులు దుర్వినియోగంపై సీఐడీ, విజిలెన్స్ విచారణ జరగనుందని, బాధ్యులైన హెచ్‌ఎంలు, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో నకిలీ, తప్పుడు దివ్యాంగ ధ్రువపత్రాలతో పొందుతున్న పింఛన్లపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఎరువుల స్టాకు విషయంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా ఉంటోందని ఏవో బాబ్జిని మంద లించారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, రైతులు సహకరిస్తే మండలంలో 1000 ఎకరాల్లో రూ.10వేల కోట్లతో థర్మల్‌పవర్‌స్టేషన్ ఏర్పాటు జరిగేలా చూ స్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కూన ప్రమీల, చల్లమాంబ, ఎల్. రాజప్పడు, కె. హనుమంతురావు, సర్పంచ్‌లు పి. ప్రసాద్, పి. వేణుగోపాల్, జాడ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు మళ్లీ వాయిదా

లావేరు: మండలంలోని గుర్రాలపాలేం, బెజ్జిపురం పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం కూడా కోరం లేకపోవడంతో వాయిదాపడ్డాయని ఎంఈవో లండ ఈశ్వరరావు తెలిపారు. ఈ ఎన్నికలు వాయిదా పడడం ఇది మూడోసారి కావడం విశేషం. శిగిరికొత్తపల్లిలో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తయినట్లు ఎంఈవో చెప్పారు.

ఆదర్శపాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ, పాఠశాల కమిటీ చైర్మన్ బీన ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కలిసి పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో దున్న జోగారావు, వాసుపల్లి అశోక్, భాస్కరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వనమహోత్సవం

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే వనమోహత్సవం విజయవంతం చేయాలని తహసీల్దార్ వెంకటరావు కోరారు. గురువారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్షించారు.

2న 'క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా'

శ్రీకాకుళం అర్బన్: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని సెప్టెంబరు 2న క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా కార్యక్రమాలు నిర్వహించాలని జనసేన రాష్ట్రప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య పిలుపు నిచ్చారు. గురువారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్ పాల్గొన్నారు.

3 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళంలో సెప్టెంబరు 3 నుంచి 6వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ (అండర్-19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పేర్కొన్నారు.ఈమేరకు శ్రీకాకుళంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చీఫ్ ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణశెట్టి వెంకటకిరణ్‌కుమార్ కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కమాండెంట్‌గా శామ్యూల్ జాన్

శ్రీకాకుళంక్రైమ్: శ్రీకాకుళం జిల్లా ఏపీఎస్పీ (ఎచ్చెర్ల) మొదటి బెటాలియన్ కమాండెంట్‌గా పి.శామ్యూల్ జాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిశారు. ఆయన విజయనగరం ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

తలనీలాల వేలంపాట వాయిదా

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాలకు సంబంధించి ఏడాదికి గాను గురువారం అనివెట్టి మండపంలో వేలంపాట నిర్వహించారు. ఏడో సారి నిర్వహించిన ఈ పాటలో గత ఏడాది కంటే తక్కువ పాట నమోదు కావడంతో వాయిదా వేసినట్లు ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు తెలి పారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం ఈవో పి.శ్యామలరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

గుజరాతీపేట: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ తెలిపారు.శ్రీకాకుళం ప్రభుత్వ మహిళాకళాశాలలో విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు.కార్య క్రమంలో పి.స్వర్ణలత, రాధాకృష్ణమూర్తి, గొంటిగిరిధర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

కంచిలి: సవరగోవిందపురం ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం వంటకాలను ఎంపీడీవో వి.నీరజ, ఎంఈవో శివరాంప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాంబాబు పాల్గొన్నారు.